# మహా యజ్ఞంలా ప్రజా సంక్షేమం

- ఎంపీలు భరత్‌రామ్, సుభాష్ చంద్రబోస్
- 'జగనన్నే మా భవిష్యత్తు' ప్రారంభం
- పాలనపై ప్రజా స్పందనను తెలుసుకునేందుకు సర్వే



జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్. పక్కన సుభాష్‌చంద్రబోస్, రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి



జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్

**రాజమహేంద్రవరం సిటీ:** పేదల గుండె చప్పుడు ఒక్క జగనన్నకే తెలుసని, అందుకే ప్రజలంతా 'జగనన్నే మా భవిష్యత్తు' అంటున్నారని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. శుక్రవారం స్థానిక 22, 38 డివిజన్లలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని ఎంపీ భరత్‌రామ్, రాజ్యసభ సభ్యుడు, ఉభయ గోదావరి జిల్లాల వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సుభాష్‌చంద్రబోస్ ప్రారంభించారు. తొలుత కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లు, కరపత్రాలు, మొబైల్ ఫోన్ స్టిక్కర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్న సర్కార్ అధికారంలోకి వచ్చాక ప్రజా సంక్షేమం ఓ మహా యజ్ఞంలా జరుగుతుందన్నారు. దేశ చరిత్రలో ఇంత పెద్దఎత్తున సంక్షేమ పథకాలు ఏ రాష్ట్రంలోనూ ఇప్పటి వరకూ అమలు కాలేదన్నారు. నాలుగేళ్లలో రూ.2 లక్షల కోట్లకు పైగా సొమ్ము సంక్షేమ పథకాల ద్వారా నిరు పేదల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా జమ చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. నాలుగేళ్లలోనే ఇంత అభివృద్ధి చేస్తే, మరో ఐదేళ్లు తిరిగి సీఎంగా జగనన్నకే అధికారం అప్పగిస్తే రాష్ట్రాన్ని మరింత సర్వతోముఖాభివృద్ధి చేస్తారన్నారు. పేదలను అన్నివిధాలా ఆదుకుని వారి జీవన విధానంలో పెను మార్పులు తీసుకు రావాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారని అన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశించిన సమసమాజ స్థాపన దిశగా ప్రభుత్వ పాలన సాగుతోందని, పాలనపై అన్నివర్గాల నుంచి పూర్తి సంతృప్తి వ్యక్తమవుతోందని ఎంపీ అన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో గృహసారథులు, కన్వీనర్లు ప్రతి ఇంటికి వెళ్లి ఆ కుటుంబ సభ్యులతో మాట్లాడి జగనన్న పాలనపై.. సంక్షేమ పథకాల అమలుపై ఐదు ప్రశ్నలు అడిగి నమోదు చేసుకుంటారన్నారు. గృహ యజమానుల అనుమతితో జగనన్నే మా భవిష్యత్తు నినాదంతో కూడిన స్టిక్కర్ ఇంటి తలుపునకు అంటించడం మొబైల్‌కు స్టిక్కర్, అలాగే ఫోన్ ద్వారా సమాచారం పంపడం జరుగుతుందని ఎంపీ వివరించారు. కార్యక్రమంలో రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, గాండ్ల తెలుకుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ సంకిస భవానీప్రియ, నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, టీకే విశ్వేశ్వరరెడ్డి, సిటీ యూత్ అధ్యక్షుడు పీతా రామకృష్ణ, క్లస్టర్ ఇన్‌చార్జులు మజ్జి అప్పారావు, కొత్తా విజయ రాజ్యలక్ష్మి, పోలు విజయలక్ష్మి, బర్రే కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజల గుండెల్లోంచి వచ్చిన కార్యక్రమమే ఇది..**

**రాజమహేంద్రవరం రూరల్:** ప్రజల గుండెల్లోంచి వచ్చిన కార్యక్రమమే 'జగనన్నే మా భవిష్యత్తు' అని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్, ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలసి నియోజకవర్గంలో 14 రోజుల పాటు ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి వివరిస్తామన్నారు. రాష్ట్రంలో సీఎం జగన్ అవినీతి రహిత పాలన అందిస్తున్నారన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, ఎల్లో మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. గత ప్రభుత్వానికి ప్రస్తుత వైఎస్సార్ ప్రభుత్వానికి తేడాను ప్రజలకు వివరిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ, నియోజకవర్గ పరిశీలకుడు మేకా శేషుబాబు మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. గత ప్రభుత్వం ఏఒక్క హామీనీ అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. భవిష్యత్తులో తిరిగి సీఎంగా జగనన్నే ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. రాష్ట్ర వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు భీమిరెడ్డి నాగేంద్ర, దొంతంశెట్టి చినవీరభద్రయ్య, పార్టీ రాష్ట్ర కార్యదర్శి మింది నాగేంద్ర, జేసీఎస్ కన్వీనర్ కొప్పిసేడి ప్రసాద్‌బాబు (రాజమౌళి), దుళ్ల సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, మాజీ సర్పంచ్ సాపిరెడ్డి సూరిబాబు, నాయకులు బత్తుల రాము, ఊటుకూరి శైలజ తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న పాలనలో ప్రతి ఇంటా ఆనందం

**ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్):** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనతో ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరుస్తుందని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. స్థానిక నగరపాలక సంస్థ 26వ డివిజన్‌లో జేసీఎస్ కన్వీనర్ కొప్పిసేడి ప్రసాద్‌బాబు (రాజమౌళి) ఆధ్వర్యంలో "జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ వెళ్లారు. ప్రతి ఇంటి వద్ద 15 నిమిషాల పాటు ప్రజలతో సంభాషించి ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు ఇతర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వానికి మద్దతు తెలిపిన వారిని 82960 82960 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని కోరారు. మిస్డ్‌కాల్ ఇచ్చిన నిమిషంలోనే కృతజ్ఞతలు తెలియజేస్తూ సీఎం జగన్ సందేశంతో ఐవీఆర్ఎస్‌కాల్ ఆ కుటుంబానికి వచ్చింది. ప్రభుత్వానికి మద్దతు తెలిపిన వారి ఇంటి తలుపునకు వారి అనుమతితో సీఎం వైఎస్ జగన్ ఫొటోతో కూడిన స్టిక్కర్ అతికించారు. అలాగే మొబైల్ ఫోన్‌కు స్టిక్కర్ అతికించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మింది నాగేంద్ర, సచివాలయ కన్వీనర్లు మేడపాటి కృష్ణారెడ్డి, కాపు భావన్నారాయణ, నాయకులు అంగాడి సత్యప్రియ, రొక్కం వంశీ, కామరాజు, నాగమణి, నాగలక్ష్మి శ్రీనివాస్, రండి భాస్కర్, కృష్ణ పాల్గొన్నారు. కాతేరు, శాటిలైట్‌సిటీ తదితర గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు.

## సర్వే ప్రారంభం

**కడియం:** మండలంలోని గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు సర్వే శుక్రవారం ప్రారంభమైంది. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తమకు నిర్దేశించిన పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి ఐదు ప్రశ్నలతో కూడిన సర్వే చేశారు. ప్రభుత్వ పథకాలు అందిస్తున్న తీరు, గత–ప్రస్తుత ప్రభుత్వాల మధ్య వ్యత్యాసం తదితర అంశాలను నేరుగా ప్రజలను అడిగి అభిప్రాయాలను సేకరించారు.

**ధవళేశ్వరం:** స్థానిక సచివాలయం–2 పరిధిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ప్రజలను కలసి పథకాల అమలు, ప్రభుత్వ పనితీరుపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. హితకారిణి సమాజం డైరెక్టర్ దేవులపల్లి సరితారాణి, వైఎస్సార్ సీపీ నాయకులు తలారి వరప్రసాద్, ఎస్‌వీ శేఖర్, పేర్ల బాసి, పసుపులేటి దేవి తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### జాతర మహోత్సవాలకు శ్రీకారం



మోరంపూడిలో పోలేరమ్మకు పూజలు చేస్తున్న దృశ్యం

**రాజమహేంద్రవరం రూరల్:** మోరంపూడి గ్రామ దేవత మాతృశ్రీ పోలేరమ్మ అమ్మవారి ఆలయం వద్ద జాతర మహోత్సవాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు రాయి లక్ష్మణరావు, మణి దంపతులు కలశస్థాపన చేసి ప్రారంభించారు. ఈ నెల 11వ తేదీ వరకూ ఉత్సవాలు జరుగుతాయి. ఈ సందర్భంగా పోలేరమ్మ సత్సంగ్ మహిళలు లలితా పారాయణ చేశారు. సోమవారం కుంకుమ పూజలు, హోమాలు జరగనున్నాయి. కమిటీ ప్రతినిధులు లక్ష్మణరావు, బాలిన వేణు, లింగం వెంకటేశ్వరరావు, యేమిరెడ్డి సత్యనారాయణ, లింగం చంద్రరావు, బుడ్డిగ సురేష్, బాలిన రాజు, బుడ్డిగ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

### చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న యాదల సతీష్ చంద్రస్టాలిన్

**కడియం:** మండలంలోని కెనాల్ రోడ్డుపై జేగురుపాడు బ్రిడ్జి సెంటర్ వద్ద దివంగత దెందులూరు వెంకటరత్నం సిద్ధాంతి జ్ఞాపకార్థం వారి కుమారుడు సూరిబాబు, మహేష్‌లు చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీనిని శుక్రవారం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఆలయ కమిటీ చైర్మన్ నిచ్చెన కోళ్ల గోవిందు, బోడా అచ్యుత్, విశ్వనాథ్, మేకా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### నిస్వార్థ సేవలు అభినందనీయం



వృద్ధులకు పింఛన్లు అందజేస్తున్న జిత్‌మోహన్‌మిత్రా

**రాజమహేంద్రవరం సిటీ:** ఎలాంటి స్వార్థం లేకుండా తన జీతంలో కొంత మొత్తాన్ని వృద్ధులకు పింఛన్లుగా అందిస్తున్న వికాస్ సంస్థ నిర్వాహకుడు యార్లగడ్డ ప్రభాకర్ అభినందనీయులని సినీ నటుడు, ఆర్కెస్ట్రా నిర్వాహకుడు శ్రీపాద జిత్‌మోహన్ మిత్రా అన్నారు. శుక్రవారం స్థానిక వీఎల్‌పురం పార్కు వికాస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పేద వృద్ధులకు పింఛన్ల పంపిణీ జరిగింది. దీనికి జిత్‌మోహన్‌మిత్రా ముఖ్య అతిథిగా హాజరై పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా వంద మంది వృద్ధులకు ఒక్కొక్కరికి రూ.200 చొప్పున పింఛన్లు అందజేయడం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో కోనేరు వెంకటేశ్వరరావు మెమోరియల్ లైబ్రరీ ట్రస్ట్ చైర్మన్ వి.జగపతి తదితరులు పాల్గొన్నారు.

### నర్సరీ షెడ్డులో చోరీ

**కడియం:** వీరవరం చింతాలమ్మ గుడి రోడ్డులోని బ్రాందీ షాపు ఎదురుగా ఉన్న రామ్‌కీ నర్సరీలో దొంగలు బీభత్సం సృష్టించారు. నర్సరీ అధినేత ఆకుల కిశోర్ వ్యక్తిగత పనుల నిమిత్తం వేరే చోటుకు వెళ్లారు. తిరిగి నర్సరీ వద్దకు శుక్రవారం వచ్చి చూసేసరికి షెడ్డు తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలకు వెళ్లి పరిశీలించగా సీసీ టీవీ ఫుటేజీ స్టోరేజీ పరికరాలు, టీవీ, లాప్‌ట్యాప్ తదితర విలువైన వస్తువులు మాయమైనట్లు గుర్తించారు. బీరువాలోని వస్తువులు మొత్తం చిందరవందర చేశారు. బాధితుడు కడియం పోలీసులను ఆశ్రయించారు. అపహరణకు గురైన సొత్తు విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని కిశోర్ తెలిపారు.

### కుక్కల దాడిలో మేకల మృతి



మృతి చెందిన మేక పిల్లలు

**సీతానగరం:** కూనవరం వద్ద పంట పొలంలో 27 మేకలపై కుక్కలు దాడి చేసి చంపేశాయి. శుక్రవారం ఇతర ప్రాంతానికి చెందిన వ్యక్తులు తమ మేకలను మేతకు తీసుకువెళ్లే సందర్భంలో పంట పొలంలో వదిలివెళ్లారు. ఈ సందర్భంలో కుక్కలు దాడి చేయడంతో పది మేక పిల్లలు చనిపోయాయి. వీటివిలువ రూ.3లక్షలు ఉంటుందని పెంపకందారులు తెలిపారు.

### బాలిక అదృశ్యంపై కేసు

**సీతానగరం:** రఘుదేవపురం గ్రామానికి చెందిన బాలిక (13) కనిపించడం లేదని ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ టి.లోవకుమార్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 5 తెల్లవారుజామున తన కుమార్తె ఇంటి నుంచి వెళ్లిందని, ఇప్పటి వరకూ తిరిగి రాలేదని ఆమె తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారని అన్నారు.

## 'పోలవరం'పై కేంద్రం నమ్మక ద్రోహం

ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ శ్రీనివాస్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్

**ప్రకాశంనగర్:** పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి బాధ్యత కేంద్రానిదేనని, ఈ జాతీయ ప్రాజెక్ట్‌కు నిధులు కేటాయించకుండా నమ్మక ద్రోహం చేస్తుందని ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ విమర్శించారు. రాజమహేంద్రవరం ప్రెస్ క్లబ్‌లో సీపీఐ, సీపీఎం నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భవిష్యత్తు తరాల కోసం రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. హోదా ముగిసిన శకం అని కొందరు అనడం సిగ్గుచేటు అన్నారు. అటువంటి వారు ఆంధ్ర ద్రోహులుగా మిగిలిపోతారని మండిపడ్డారు. పాచిపోయిన లడ్డూలు ఇచ్చారని విమర్శించిన పవన్‌కళ్యాణ్ ఆ వ్యాఖ్యలకు కట్టుబడి హోదా ఉద్యమంలోకి వచ్చి పోరాడాలన్నారు. కేంద్రం పోలవరం ప్రాజెక్ట్‌కు నిధులు కేటాయించకుండా, ఎగువ ప్రాజెక్ట్‌లకు నిధులు ఇవ్వడంలో అంతర్యం ఏంటో చెప్పాలని బీజేపీ నాయకులను డిమాండ్ చేశారు. నిధులు కేటాయించకుండా రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్రం బ్లాక్ మెయిల్ చేస్తుందవ్వారోపించారు. 35 మంది ప్రాణత్యాగం చేసి సాధించిన విశాఖ ఉక్కు పరిశ్రమను కేంద్రం అమ్మేయాలని చూస్తోందన్నారు. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలన్నారు. సమావేశంలో సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు అరుణ్, తాటిపాక మధు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రంపై సమరం చేద్దాం..




సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు వనజ

**ప్రకాశంనగర్:** ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్‌లకు ఊడిగం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిపై సమరం సాగించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో పార్టీ జిల్లా సమితి సమావేశం జిల్లా సహాయ కార్యదర్శి రేఖ భాస్కరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్యాస్, ఇంధన ధరలు పెరగడంతో పేదల బతుకులు చిన్నాభిన్నం అయ్యాయన్నారు. ధరలను నియంత్రించడంలో కేంద్రం విఫలమైందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ బీజేపీ కో హఠావ్.. దేశ్‌కో బచావ్ నినాదంతో సీపీఐ, సీపీఎంల ఉద్యమానికి పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కుండ్రపు రాంబాబు, కార్యవర్గ సభ్యుడు వి.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

## మహా కాళేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



మహా కాళేశ్వరాలయంలో పూజలు చేస్తున్న సీతారామ్ మహేశ్వరి దంపతులు

**ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్):** స్థానిక ఇన్నీసుపేట కైలాసభూమి సమీపంలోని మహా కాళేశ్వరాలయం (మరో ఉజ్జయిని) ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా రెండో రోజు శుక్రవారం సీతారామ్ మహేశ్వరి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి స్వామివారికి గణపతి పూజ, గోపూజ, పల్లకీసేవ, గోదావరిలో ఉత్సవమూర్తుల చక్రస్నానం, సాయంత్రం సహస్ర కుంకుమార్చన, నీరాజన మంత్రపుష్పం, వేదస్వస్తి నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రసాదం స్వీకరించారని వ్యవస్థాపక అధ్యక్షుడు పట్టపగలు వెంకటరావు తెలిపారు. శనివారం గణపతిపూజ, పుణ్యాహవచనం, గోపూజ, రక్షాబంధనం, మహాకాళీ అమ్మవారికి ×లక్ష కుంకుమార్చన, సాయంత్రం నాలుగు గంటలకు వివిధ కార్యక్రమాలు ఉంటాయని ఆలయ అర్చకుడు ఆదిత్య తెలిపారు.

## ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

**మధురపూడి:** రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. శుక్రవారం కోరుకొండ మండలం బొల్లెద్దుపాలెంలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి ప్రజలను పలకరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానిక బీసీ, ఓసీ పేటల్లోని 200 కుటుంబాలను కలుసుకున్నారు. ఆయనకు మహిళలు హారతులు ఇస్తూ స్వాగతం పలికారు. సంక్షేమ పథకాలు అమలు కావాలంటే వచ్చే ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని ఎమ్మెల్యే ప్రజలను కోరారు. పార్టీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, కోకన్వీనర్ గణేశుల పోసి, సర్పంచ్ కె.వెంకట రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యురాలు అల్లి సింహాచలం, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు దేగల బాబులు పాల్గొన్నారు. అనంతరం వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో భాగంగా వరి కోత మెషీన్‌ను ప్రారంభించి గాదరాడ రైతులకు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అందజేశారు.

## ఉప కులాల ఐక్యతతో బీసీల అభివృద్ధి

మాజీ మంత్రి కొల్లు రవీంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్ర

**సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం):** బీసీల అభివృద్ధికి ఉప కులాల ఐక్యత అవసరమని టీడీపీ బీసీ ఫెడరేషన్ అధ్యక్షుడు, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. రాజమహేంద్రవరంలో శుక్రవారం టీడీపీ శెట్టిబలిజ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు కుడుపూడి సత్తిబాబు ఆధ్వర్యంలో శెట్టిబలిజ, గౌడ, శ్రీశయన, ఈడిగ యాత కులాల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుంచి బీసీల మనుగడ ప్రశ్నార్థకంగా మారిపోయిందన్నారు. చంద్రబాబు నాయుడు తీసుకొచ్చిన అనేక పథకాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. రూ.34 వేల కోట్ల బీసీ నిధులను సీఎం దారి మళ్లించారన్నారు. మధ్యాహ్నం భోజన విరామం అనంతరం ఉపకులాల వారీగా నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వచ్చే ఎన్నికల నాటికి అన్ని కులాలను ఏకం చేసి టీడీపీ గెలుపునకు కృషి చేసే విధంగా కార్యాచరణ సిద్ధం చేయాలని సాధికార కమిటీ సభ్యులకు రవీంద్ర దిశానిర్దేశం చేశారు. శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, అంగర రామ్మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి వాసు, మాజీ మంత్రి కేఎస్ జవహర్, మాజీ ఎమ్మెల్యేలు పెందుర్తి వెంకటేష్, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లోక రక్షకుడు ఏసుక్రీస్తు

- ఎంపీ మార్గాని భరత్‌రామ్
- నగరంలో భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



బైబిల్ మిషన్ కెథ్డ్రాల్ చర్చిలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్ తదితరులు



దామిరెడ్డిపల్లిలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు చేస్తున్న విశ్వాసులు



ఆర్‌సీఎం ఎలిఫోర్నియా చర్చి ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

**సీటీఆర్ఐ:** సకల జనుల పాప పరిహారార్థం సిలువపై ఏసుక్రీస్తు బలిదానం అయిన సందర్భాన్ని పురస్కరించుకుని గుడ్ ఫ్రైడేను శుక్రవారం క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. క్రీస్తు త్యాగాన్ని స్మరించుకుంటూ ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. కొంతమూరు నుంచి స్థానిక ఆనం కళాకేంద్రం వద్ద ఆర్‌సీఎం చర్చి వరకూ ర్యాలీ నిర్వహించారు. ఇందులో ఏసుక్రీస్తు వేషధారుడు సిలువుని మోస్తుండగా భటులు కొరడాలతో కొడుతూ తీసుకు వస్తున్నట్లు యాత్ర సాగింది. మానవాళి కోసం లోక రక్షకుడైన క్రీస్తు ప్రాణత్యాగం చేసిన రోజు 'గుడ్ ఫ్రైడే' అని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. నగరంలోని బైబిల్ మిషన్ కెథ్డ్రాల్, సెంట్ పీటర్స్ లూథరన్ చర్చిలలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలలో ఎంపీ పాల్గొన్నారు. మానవాళి పాపాల పరిహారార్థం తన ప్రాణాలను జీసస్ శిలువపై పణంగా పెట్టాడని అన్నారు. ఏసుక్రీస్తు నుంచి ప్రతి ఒక్కరూ ఎంతో నేర్చుకోవాలన్నారు. కరుణ, దయ, తోటివారికి సహాయ పడటం, క్షమాగుణం ఇవన్నీ ఏసు బోధనలని చెప్పారు. ఈ గుణాలు ప్రతి ఒక్కరిలో ఉన్నప్పుడు ప్రపంచంలో మానవులంతా సుఖ సంతోషాలతో జీవిస్తారన్నారు. అటువంటి రోజు కోసం ప్రతి ఒక్కరూ తమని తాము మార్చుకోవాలని ఎంపీ అన్నారు. క్రీస్తు బాటే అందరికీ స్ఫూర్తి దాయకమని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, బిషప్ ఎస్.విజయరాజు, రెవరెండ్ డాక్టర్ ఎస్.సీమెన్ సుదర్శన్, రెవరెండ్ ఎస్.విలియమ్ బెంటిక్, రెవరెండ్ ఎ.శామ్యూల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

**కడియం:** మండలంలోని చర్చిల్లో గుడ్ ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. కడియం, కడియపులంక, వేమగిరి, దుళ్ల, జేగురుపాడు, మురమండ తదితర గ్రామాల్లోని చర్చిలకు విశ్వాసులు పెద్ద ఎత్తున హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దామిరెడ్డిపల్లిలోని బైబిల్ మిషన్ మహిమ మందిరంలో దేవరపల్లి రత్నరాజు ఆధ్వర్యంలో జరిగిన ప్రార్థనల్లో దేవరపల్లి కళ్యాణిఫ్రాన్సిస్ పాల్గొన్నారు.

## జేసీఐ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ



సైకిల్ ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

**కంబాలచెరువు:** ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జేసీఐ రాజమహేంద్రవరం గోదావరి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో సైకిల్ ర్యాలీ జరిగింది. ఇది జిల్లా ప్రభుత్వాసుపత్రి నుంచి పుష్కరాల రేవు వరకూ సాగింది. ఈ సందర్భంగా జేసీఐ అధ్యక్షుడు బి.శివ కుమార్ మాట్లాడుతూ అందరికీ ఆరోగ్యం అనే నినాదంతో ఈ ఏడాది ఆరోగ్య దినోత్సవం జరుపుకొంటున్నామన్నారు. గుండెపోటు వచ్చినప్పుడు చేయాల్సిన అత్యవసర చికిత్సను ఐఎమ్ఏ వైద్యులు వివరించారు. అనంతరం యోగా గురువు పతంజలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగాసనాలపై వివరించారు. కార్యక్రమంలో జేసీఐ ప్రతినిధులు కృష్ణచైతన్య, రాకేజైన్, డాక్టర్ అనసూరి ప్రియాంక, ఐఎంఏ కార్యదర్శి పిడుగు విజయభాస్కర్, వైద్యులు వేణుగోపాల్, గౌతమ్, మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానానికి ముందుకు రావాలి



రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న దానియేలు

**రాజమహేంద్రవరం రూరల్:** కొంతమూరు సంతోష్‌నగర్‌లోని క్రైస్ట్ చర్చ్‌లో గుడ్ ఫ్రైడే సందర్భంగా ఆల్ ఇండియా ట్రూ క్రిస్టియన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. భీమవరానికి చెందిన ఏఎస్ఎన్ రాజు చారిటబుల్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని కాలేజ్ ఆఫ్ బైబిల్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ బి.డానియేలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు సమస్త మానవాళి కోసం తన చివరి రక్తపు బొట్టునూ అందించి తన ప్రేమను చాటారన్నారు. దీనిని స్ఫూర్తిగా తీసుకుని ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్షించేందుకు రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. ఆల్ ఇండియా ట్రూ క్రిస్టియన్ కౌన్సిల్ డైరెక్టర్ జయశాలి పి.డి.సుందరరావు పిలుపు మేరకు శిబిరాన్ని నిర్వహించామని డానియేలు తెలిపారు. సుమారు 30 మంది రక్తదానం చేశారు.

## గాయపడిన విద్యార్థి మృతి



పసుమర్తి శ్రీహర్ష (ఫైల్)

**రాజమహేంద్రవరం రూరల్:** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ ఓ విద్యార్థి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. హుకుంపేట డీఎస్ఆర్ నగర్‌కు చెందిన పసుమర్తి శ్రీహర్ష (17) గైట్ కళాశాలలో పాలిటెక్నిక్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. గురువారం సాయంత్రం చర్చి పని ముగించుకుని స్నేహితుడు బొమ్మూరుకు చెందిన కాళ్ల హరీష్‌తో కలసి అతని బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. బొమ్మూరు సెంటర్‌లో రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీహర్ష, హరీష్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. శ్రీహర్షను చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కొద్ది సేపటికే శ్రీహర్ష మృతి చెందాడు. మృతుడి తల్లి పసుమర్తి శ్రీలక్ష్మి ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఎస్సై శివాజీ కేసు నమోదు చేశారు. మూడేళ్ల కిందట భర్త సురేష్ మృతి చెందడంతో శ్రీలక్ష్మి ఇద్దరు కుమారులను ప్రయోజకులు కావాలని పాలిటెక్నిక్ చదివిస్తుంది. ఈ తరుణంలో చిన్న కుమారుడు శ్రీహర్ష రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి.

## విద్యుత్తు సరఫరా పునరుద్ధరణ



విద్యుత్ స్తంభం ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

**సీతానగరం:** రఘుదేవపురంలో విరిగిన విద్యుత్తు స్తంభాన్ని తిరిగి ఏర్పాటు చేసి సరఫరాను ఆ శాఖ అధికారులు పునరుద్ధరించారు. పదిహేను రోజుల కిందట వర్షాలకు చెట్టు పడి విద్యుత్తు స్తంభం పడిపోయింది. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయి మోటార్లు పని చేయక పోవడంతో సుమారు ఏభై ఎకరాలకు సాగునీటి సరఫరాకు ఆటంకం కలిగింది. స్తంభం ఏర్పాటు చేయాలంటే పొలంలో నీరు ఉందని విద్యుత్ శాఖాధికారులు కొన్ని రోజులు వేచి చూశారు. అదే లైన్‌పై ఉండే కొన్ని మోటార్లకు వేరే లైన్‌పై విద్యుత్‌ను అందించడంతో కొంత మేర పొలాలకు నీరు అందింది. సుమారు ముప్పై ఎకరాల్లో కూరగాయల పాదులు, పామాయిల్, మొక్కజొన్న పంట దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. విద్యుత్ లేక పంటలకు నష్టం కలుగుతుందని రైతులు తెలపడంతో విద్యుత్తు శాఖ ఏడీఈ చిట్టిరాజు యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి పూర్తి చేయించారు.